# బాకీ

సైన్స్ అయ్యవారికి బదిలీ అయిందని, త్వరలో ఊరొదిలి వెళ్లిపోతారని ఆ రోజు సాయంకాలం చివరి పీరియడ్‌లో తెలిసింది. అది తెలిసినప్పటినుంచి స్కూళ్లో పిల్లలంతా ఆయన గురించి గుసగుసగా మాట్లాడుకుంటున్నారు.

"ఐవేరు ఎంతబాగా పాటలు పాడతాడ్రా"

"అవును. మనకందరికీ పాటలు నేర్పించింది ఆ ఐవేరే గదా, పాఠాలు... ఎంతబాగా అర్థమయ్యేటిగా చెప్తాడో. పీరిడ్ అప్పుడే ఐపోయిందా అనుకుంటాం. అదే సుబ్బారెడ్డి ఐవోరు పాఠం చెప్తే మాత్రం నిద్రవచ్చేస్తాది."

"అవునురా... మిగిలిన ఐవేర్లు పాఠాలు సరిగా చెప్పరు. మనం ఆన్సర్లు బాగా చెప్పలేదని కొడతారు. సైన్స్ ఐవోరు ఎవుర్నేగాని కొట్టడు. ఎవురికన్నా పుస్తకాలకు, పెన్నులకు దుడ్డు లేదంటే ఇస్తాంటాడు. ఎంతమంచయివోరు గదా" అని పిల్లలంతా రకరకాలుగా అయ్యవారి మంచితనం గురించి చెప్పుకుంటున్నారు.

తొమ్మిదవ తరగతి చదువుతున్న సురేంద్ర మాత్రం ఎవ్వరితో మాట్లాడ్డంలేదు. సురేంద్ర అప్పుడప్పుడు బొమ్మలు వేస్తుంటాడు. ఆ బొమ్మలు చూసి "ఏరా ఎధవా... చదువుకోరా అంటే బొమ్మలు ఏసుకుంటా వుండావా. ఇంగెప్పుడన్నా బొమ్మలు ఏసినావంటే తోలుతీస్తా" అని అయ్యవార్లంతా అరిచేవారు.

"అరే... చానా బాగా ఏసినావే. ఇదే విధంగా ప్రాక్టీస్ చేస్తాండు. మంచి ఆర్టిస్ట్‌వవుతావు. నీక్కావాలంటే స్కెచ్ పెన్‌లు తీసిస్తాలే" అనేవాడు సైన్స్ అయ్యవారు. అనడమేకాదు నాలుగు రకాల స్కెచ్ పెన్నులు తీసిచ్చాడు. దాంతో వాడికి ఆ అయ్యవారంటే ప్రత్యేక అభిమానం. దానికి తోడు ఆ సంవత్సరం నోటుపుస్తకాలు కొనలేకుండా వుంటే యాభైరూపాయలిచ్చి తీసిచ్చాడు ఆయన. అదంతా గుర్తుకు వచ్చి వాడు చానా బాధపడుతున్నాడు. స్కూలు వదులుతూనే నేరుగా అయ్యవారి ఇంటికి పోయాడు.

"ఏం సురేంద్రా... ఇంటికి పోలేదా..."

"పోతాను సార్... నేను నీకు యాభైరూపాయలు ఇవ్వాలసార్" అన్నాడు ఒక్కోమాటను కూడబలుక్కుంటూ.

"యాభైరూపాయలా... దేనికి?"

"నాకు పుస్తకాలు తీసిచ్చినావు కదాసార్"

"పోరా... అదేంది మల్లా నాకిచ్చేది. ఏదో పేదోనివి, బాగా చదువుకుంటాండావని తీసిచ్చినాను. దబ్బేం ఇవ్వద్దులే"

"లేదుసార్... రెండు దినాల్లో ఎట్లోగట్ల తెచ్చిచ్చేస్తా" అని చెప్పి వచ్చేశాడు సురేంద్ర. వాడికి అయ్యవారితో ఇంకా ఎక్కువగా మాట్లాడాలని వుండాది. కానీ ఎందుకో అయ్యవారి ఎదుట వాడికి గొంతు పెగలడం లేదు. అయన ఇక తమకు పాఠాలు చెప్పడు, ఈ ఊర్లో వుండడు అనే వూహే వాడు భరించలేకుండా వున్నాడు. నేరుగా ఇంటికి పోయాడు.

"నాయినా... మా సైన్సయివోరికి ట్రాన్సపరొచ్చింది"

"అరెరే... మంచి ఐవోరు. ఎందుకంట."

"ఏమో..."

"ఏ వూరికి?"

"తెలీదు..." అంటూ పుస్తకాలను వాడకాగు పక్కన చెక్కమీదుంచాడు సురేంద్ర. వుయ్యాల్లో ఏడుస్తూ వున్న తమ్ముడ్ని వూపుతూ మౌనంగా కూర్చుని వున్న తండ్రి వద్దకు వచ్చి పక్కన నిల్చున్నాడు.

"ఏం... గమ్మున నిలబడుకున్నేవు. మీ అమ్మ నీళ్లకు పోయిండాది. నువ్వొగ బిందెత్తుకోని పో..." అని కండ్ల నిండుకు నీళ్లతో ఉన్న కొడుకును చూసి "ఏమట్లుండావే?" అన్నాడు ఆచారి కంగారుగా.

"మనం ఐవోరికి యాభైరూపాయలీయద్దా?" అన్నాడు మెల్లగా కళ్లలోనుంచి నీళ్లు రాకుండా వుండటంకోసం కన్రెప్పలు టపటపలాడిస్తూ సురేంద్ర.

ఆ మాటలతో ఆచారి మౌనంగా ఉండిపోయాడు.

"ఏం నాయినా... గమ్మునయిపోతివి. ఐవోరు ఎల్లిపోతాడు. దుడ్డు ఇచ్చేయాల. ఆ పొద్దు పుస్తకాలకు ఇచ్చినాడు కదా. మా ఐవోరు చానామంచోడు."

"చూస్తాండావు కదా... మన పరిస్థితి. ఇంట్లోకి రాత్రికి అన్నానికి బియ్యం కూడాలేవు. ఏమన్నా పనులుంటే కదా దుడ్డు వుండేదానికి. చదువు ఆపేద్దామనుకుంటే ఆడబిడ్డను చదివించి మగబిడ్డను చదివీకుంటే బాగుండదని బడికంపిస్తాండాం. వానలు పడింటే సేద్దిం వున్నిండు. మనకు ఏదన్నా పని వున్నిండు" అన్నాడు ఆచారి.

"చెనిగి చెట్లు పెరకతాండారు కదా. రెండు రోజులు కూలికి పోతా...."

"ఆc... మనం ఏపొద్దేకాని కూలికి పోయినామా. మడకలు చెక్కేదో, కొడవండ్లకు కక్కుపెట్టేదో, యాడన్నా తీర్లు పాడు కోసేదుంటే కోసేదో చేసుకుంటాం కాని కూలికి పోము." అన్నాడు ఆదేదో గొప్ప విషయమైనట్టు ఆచారి.

"ఇదో... నాయినా బిందె దించుకో..." అంట్లూ శివమ్మ వచ్చింది. సురేంద్ర ఆమె భుజం మీదనుంచి బిందెను దించికింద పెడుతూ "ఏంమ్మా... నేను వచ్చినాంక నీళ్లు తెచ్చిందుకదా" అన్నాడు.

"బడి నుంచి వస్తానే యాడంపేదిలే. తాగేదానికి కూడా లేకుండా ఐపోయినాయి..." అని బిందెను తీసుకుందామె.

"నేనుతెస్తాలే నువ్వుండుమా... మా సైన్సయివోరు వేరే వూరికి పోతాండాడు. మనం ఐవోరికి యాభైరూపాయలు ఇయ్యద్దా. నేను రెండురోజులు చెనిగి చెట్లు పెరికేదానికి పోతాను." అన్నాడు సురేంద్ర.

"ఎందుకు ఎంతసేపు కూలికి పోతానంటావే. మన ఇంటిముందుకు ఏ పొద్దే కాని కాపోళ్లు వచ్చి కూలికి పిల్చిందిలే ఇంతవరకు. ఇప్పుడంటే వొరుపొచ్చి మనం ఇట్లుండాము గానీ, లేకుంటేనా... ఏదో ఒగ పనుండదా. పెద్దింగారికి చెనిగి చెట్లు పెరికేదానికి మనుసులు దొరకలేదంట. తొందరగా చెట్లు పెరక్కపోతే మళ్లా వాన వస్తాదో రాదో అని అందురూ కూలోల్లకోసం ఎగబడతాండారు. పల్లెముందరమారు గుత్తకు ఒప్పిస్తారేమో పోయి అడగతా. మూడు రోజులు కష్టపడినామంటే ఐదునూర్లు వస్తాది." అని లేచి వీధిలోకెళ్లాడు ఆచారి.

శివమ్మ చీపురు తీసుకొని ఇంటిముందు చెత్త వూడ్చసాగింది. సురేంద్ర పెరట్లోకి పోయి కాళ్లు చేతులు కడుక్కుని వచ్చి అన్నంపాత్రలు చూశాడు. అన్నీ ఖాళీగా వున్నాయి. మధ్యాహ్నామే అన్నం తక్కువ వున్నింది. వుండదని తెలిసినా వుంటుందేమో అని ఆశగా చూశాడు. బిందె తీసుకుని బోరింగు వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చి తొట్టిలో పోయసాగాడు. శివమ్మ చెత్త వూడ్చి పెరట్లో పాత్రలు వేసి తోమసాగింది.

ఆచారి వచ్చి "చేను ఒప్పుకొన్నేనే" అన్నాడు శివమ్మతో.

"ఒప్పుకొన్నేవా... ఏది. ఇప్పుడే పోదామా. అడ్మాన్సు ఇచ్చినారా?" అన్నాడు సురేంద్ర నీళ్ల బిందెను దించుతూ.

"పల్లెముందర చేనే. మూన్నూర్లా యాభైకి ఒప్పుకున్నే. అడ్మాన్సు దుడ్డు ఈలా. బియ్యం పదిశేర్లు ఇచ్చినారు. చెనిగి చెట్లు పెరికేదంతా అయిపోయినాంక మిగిలిన దుడ్డు ఇస్తారంట" అన్నాడు ఆచారి.

"పదాం పానాయినా" అన్నాడు సురేంద్ర. ఎప్పుడు చేతికి డబ్బు వస్తుందా, అయ్యవారికి ఇద్దామా అని వుండాడు.

"ఇప్పుడొద్దులే. పొద్దుపోతాండ్లా. మొబ్బుతోనే లేసినామంటే ఎన్నెలుంటాది. పోదాం" అన్నాడు ఆచారి.

ఆరోజు రాత్రి పుస్తకం ముందుకూర్చున్నా, అన్నం తింటున్నా వాళ్ల సార్‌కు ఇవ్వాల్సిన

యాభైరూపాయలే గుర్తుకు వస్తాంది వాడికి. పడుకున్నా నిద్రలో కూడా అవే కలలు. తొలికోడి కూతవేస్తానే ఆచారి నిద్రలేచాడు. కొడుకును నిద్రలేపాడు. వూర్లో ఆడవాళ్లు వంటపనులు చేయడం కోసం ఒక్కొక్కరే నిద్రలేస్తున్నారు. పౌర్ణమి పోయి పదిరోజులు అవుతండడంతో తూర్పున అర్ధచంద్రుడు బలహీనంగా వెలుగుతున్నాడు. తండ్రీ కొడుకులు చేనులోకి వెళ్లారు. తెల్లవారుజామున కావటంతో మంచు సన్నపాటి వర్షంలా కురుస్తోంది. తలలకు చెవులను కప్పేటిగా తందుగుడ్డలను చుట్టుకుని వణికించే చలిలో వెరుశనగ చెట్లు పెరకడం మొదలు పెట్టారు. అప్పుడే అయిపోతుంది అనే విధంగా వేగంగా చెట్లను పెరుకుతున్నాడు సురేంద్ర. ఆచారి కూడా కొడుకుతోపాటు చెట్లు పెరుకుతున్నాడేకాని అతని మనసును ఏవేవో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. వాళ్ల ఐవోరికి బాకీ వుండటం గురించి కంగారు పడుతున్న కొడుకును చూస్తే ఆచారికి తన పెళ్లినాటి సంఘటనలు గుర్తుకు వస్తున్నాయి.

"ఏమల్లుడూ... వోలి ఎంతిస్తావో చెప్పు. నా రెండో కూతుర్ని ఇస్తా" అన్నాడు సిద్దప్ప.

అచారి నవ్వుతా సమాధానం చెప్పకుండా వుండిపోయాడు.

"నవ్వితే ఎట్ల?" అన్నాడు సిద్దప్పకూడా నవ్వుతా.

"నీకు తెలీంది ఏముండాది మామా. ఎనకాముందు ఎవురూ లేనోన్ని. ఆస్తిపాస్తులు లేవు. చేతిపని నమ్ముకోని బతుక్కొంటా వుండా. నీకూతుర్ని ఇస్తే కష్టపెట్టకుండా సాక్కొంటా" అన్నాడు తను వోలి ఇవ్వలేననే సంగతిని చెప్పకనే చెబుతూ.

ఆ మాటలకు "హ్హా... హ్హా... హ్హా.... నీ పనితనం గురించి నాకు తెలీదా. నీ మంచితనం గురించి నాకుతెలీదా. నీకు బిడ్డనిస్తాండేది అయ్యి చూసే కదా. ఎంతైనా బామ్మర్దిని. మీ అక్క బతికున్నే నీకొాగ బిడ్డనిచ్చుండు. సరేలే... ఇన్నూర్రూపాయలిచ్చి చేసుకో" అన్నాడు సిద్దప్ప.

"సరేమామా... వారం దినాల్లో తెచ్చిస్తా" అన్నాడు ఆచారి.

చెప్పిన విధంగానే వారం దినాల్లో డబ్బుతీసుకుని మామ దగ్గరికి పోయి "మామా... నా దగ్గర నూటేభై వుండాది. మిగిలింది మళ్లిస్తా" అన్నాడు.

"మళ్లా ఏమిస్తావులే వోయ్... కాదల్లుడూ చేతిపనోళ్లం బాకీలేకుండా బతకాలంటే అయితాదా? మనం రైతులకు, మనకు రైతులు బాకీ వుండనే వుంటారు. అయ్యి ఒగదెంచాలన్నా అయ్యేటియి గాదులే." అని డబ్బును తీసుకున్నాడు సిద్దప్ప.

"లేదులేదు మామా. మాటన్నేక మాటే. మిగిలింది కూడా ఇచ్చేస్తా..." అన్నాడు ఆచారి.

ఆతర్వాత పెళ్లయిపోయింది. కొంతకాలానికి సిద్దప్ప కాలం చేశాడుకానీ అచారి మాత్రం మిగిలిన యాభైరూపాయలు ఇవ్వలేకపోయాడు. నిలువ నీడకూడా లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని, చేతిలో పనిని నమ్ముకుని ఆలూమగలు దేశంమీద పడ్డారు. వూర్లన్నీ తిరిగింతర్వాత ఇప్పుడున్న వూర్లో స్థిరపడ్డారు. మడకలు చెక్కడంతో పాటు ఇంటికి అవసరమైన తలుపులు,

దాలమంద్రాల కోసం తుండ్లు కోసేవాళ్లు. ఆ పనిలో ఆలూమగలే రంపంపట్టుకోని చెరొక పక్కనుండి కోసే వాళ్లు. దాలమంద్రాలు తయారు చేయాలన్నా ఇద్దరూ కలిసి చేసేవాళ్లు. ఆచారి కొయ్యలకు మార్కింగు చేసి కోసుకుంటాంటే శివమ్మ వులి, గూటము తీసుకుని రంధ్రాలు కొట్టేది. తను ఇంటిపనితో పాటు భర్తతో కూడా వుండి పనిచేస్తున్నా వచ్చే సంపాదన బొటాబొటీగా సరిపోయేది.

భర్త ఇంటిదగ్గర లేనప్పుడు గాజులు, వంట పాత్రలు లాంటివి వచ్చినా కొందామంటే ఆమె చేతిలో చిల్లిగవ్వ వుండేదికాదు. ఒకరోజు రాత్రి ఆచారితో "ఏంబా... నేను నీతో పాటు వచ్చి కష్టం చేస్తాండా. నాక్కూడా దుడ్డు ఇవ్వచ్చుగదా" అంది.

అందుకు ఆచారి నవ్వుతూ "ఎంత కావాలో చెప్పే. రోజుకూలి ఇచ్చేస్తాలే నీగ్గూడా" అన్నాడు.

"ఆ... కూలి ఇస్తాడంట కూలి. బయటోళ్లకు రోజుకు ముప్పై నలబై ఇస్తాండావు కదా. నాకంత వద్దులే. పనిచేసిన రోజుకు పది రూపాయలు ఈ చాలు" అందామె.

"సరే... ఇంగనుంచి లెక్కేసుకో. ఎన్నిరోజులు పనిచేస్తావో అన్ని రోజులకు పదిరూపాయల లెక్కన లెక్కేసుకో. పని అయిపోయి లెక్క ఒగదెంచుకుంటాం కదా. ఆ రోజు నీకివ్వాల్సింది ఇచ్చేస్తా" అన్నాడు.

రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు "ఏమే.. నీదగ్గర ఇచ్చినానే నూర్రూపాయలు. అదీ మళ్లిస్తా" అన్నాడు ఆచారి శివమ్మతో.

"ఎప్పుడిచ్చినావు?" అంది కోపం నటిస్తూ శివమ్మ.

"అంత కోపం ఎందుకుబా... మళ్లా ఇచ్చేస్తాలే." అన్నాడు ఆచారి నవ్వుతూ.

"నువ్వు నొగద్దు నాకు కోపం వస్తాది. ఇప్పటికి రెండు నెల్లమింటి పని చేస్తాండాం. మద్దెలో పండగప్పుడు రెండు రోజులు పని చేయలేదంతే. రోజుకు నాకు పదిరూపాయలు ఇస్తానంటివి కదా. రెండు నెల్లకు నాకు ఆరునూర్లు ఇవ్వాల. ఎంతిచ్చినావు? వారం దినాలముందు నూర్రుపాయలిచ్చినావు. అది కూడా కావాలంటా వుండావే" అంది కాస్త తీవ్ర స్వరంతో శివమ్మ.

"లేదులేయే... చూస్తాండావు కదా. ఇస్తాలే... నూర్రూపాయలీ. మళ్లా రేపాదివారం ఇచ్చేస్తా. అంతకోపమయితే ఎట్ల" అన్నాడు నవ్వుతూనే ఆచారి.

"ఇప్పటికి ఎన్నినూర్లు? ఉగాది పండక్కు రెండునూర్లు తీసుకున్నేవు, ఈలా. అంతకు ముందు పాపకు ఫీజు కట్టాల వాయల్పాడుకు పోయేసి రావాలని నూర్రుపాయలు తీసుకున్నేవు. రెండు వారాలకుముందుకూడా నూటేబై తీసుకున్నేవు. తీసుకుంటావుకానీ ఎప్పుడే కానీ ఈవు." అంటూనే దొంతులు దించింది. రాగుల బానలో నుంచి గుడ్డతిత్తి తీసింది. ఆచారి ముందుకు వంగి తొంగి చూసినాడు ఎంతుందో డబ్బు అని.

"ఇదే వుండేది. మళ్లా రేపాదివారం ఇచ్చేయాల" అని వందరూపాయలు ఇచ్చింది శివమ్మ.

ఆ డబ్బును తీసుకుని "రేపు చిన్నబ్బన్న ఇస్తానన్నేడు దుడ్డు. ఆయన్న ఇచ్చినాడంటే రేపే ఇచ్చేస్తా" అన్నాడు ఆచారి.

అప్పుడప్పుడు భార్యకు యివ్వాల్సిన డబ్బును లెక్కవేయడానికి ప్రయత్నిస్తుంటాడు. అది సాధ్యంకాక 'అఁ దానికేంది యిచ్చేది. సంపాదించిందంతా దానికేగదా. నేనేమన్నా తాగతాండానా, ఆడతాండానా' అనుకుని తనను తాను సమాధాన పరచుకుంటాడు.

"నాయనా నీళ్లు తెచ్చుకోనుంటే బాగుండు. దప్పికగా వుండాది" అన్నాడు సురేంద్ర. ఆ మాటలతో ఆచారి ఆలోచనలు ఆగిపోయాయి.

బాగా తెల్లవారిపోయింది. మంచు ఎక్కువగా కురుస్తోంది. పదిబారల దూరంలో వున్నవి కూడా స్పష్టంగా కనిపించడంలేదు. వాళ్ల వంటిమీదున్న బట్టలు కూడా తడచిపోయాయి. అంతటి చలిలోనూ చెమటలు పడుతున్నాయి.

"ఇంటికి పోయి తాగేసి, చెంబుతో తీసుకోనిరాపో. నాక్కూడా దప్పికగా వుండాది" అన్నాడు ఆచారి.

సురేంద్ర చేతులకంటిన మట్టిని కందిచెట్ల ఆకులమీదున్న మంచుచుక్కలకు తుడుచుకున్నాడు. తలకు చుట్టుకున్న తుండుగుడ్డను తీసి చేతులు తుడుచుకుని ఇంటివేపు నడిచాడు.

ఆచారి తిరిగి చెట్లు పెరకసాగాడు. పెరికిన చెట్లను కాయలన్నీ ఒకే వైపు వచ్చేటిగా వేసుకుంటూ పోతున్నాడు. కూతురున్నింటే అన్నం ఎత్తుకోనొచ్చిందుకదా అనుకున్నాడు. ఆచారి కూతురుకు పెళ్లి చేసి రెండు సంవత్సరాలయింది. కూతురు పెళ్లినాటి సంఘటనలు పుట్టలోనించి చీమలు బయటకు వచ్చినట్టుగా ఒక్కోటి గుర్తుకు రాసాగాయి.

అల్లుడు తరపున అమ్మాయిని చూడ్డానికి మొత్తం తొమ్మిది మంది వచ్చారు. మధ్యాహ్నం భోజనాలయింతర్వాత కట్న కానుకల విషయం మాట్లాడ్డానికి కూర్చున్నారంతా. తన దగ్గర బిడ్డ తప్ప ఏమీ లేదన్నాడు ఆచారి. వాళ్లు ఇరవై వేలు డబ్బు, పది తులాల బంగారం ఇచ్చి పెళ్లి చేసివ్వమన్నారు. తను కూతురికి కమ్మలు, ముక్కుపుల్ల, కాళ్ల గొలుసులు, అల్లునికి వాచీ వుంగరం తప్ప ఇంకేం ఇవ్వలేనన్నాడు. అల్లునికి అమ్మాయి నచ్చడం, సంప్రదాయం కల కుటుంబం అనుకోవడంతో చివరికి అందరూ ఆచారి చెప్పిందానికే ఒప్పుకుని వెళ్లారు.

పక్కింటి వాళ్ల కమ్మలు పెట్టి కూతురు పెళ్లి జరిపించాడు. అల్లునికి మాత్రం వుంగరం, వాచీ తీసీలేదు. పక్కింటి వాళ్లు కమ్మలు అడుగుతుండటంతో పెళ్లయిన నెలకంతా కూతురింటికి పోయినాడు ఆచారి. తండ్రి వచ్చినందుకు సంతోషించింది కూతురు.

ఆరాత్రి కూతురిని పక్కకు పిలిచి "అమ్మా... పక్కింటి వాళ్లు కమ్మలు అడగతాండారు" అన్నాడు మెల్లగా.

"తీసుకోని పోయి ఇచ్చేయి నాయినా. ఇప్పుడే తీసిస్తాను. జోబీలో పెట్టుకో. మళ్లా పద్దనికి గుర్తుంటాదో వుండదో" అని కూతురు చెవులకున్న కమ్మలుతీసి ఆచారికి ఇచ్చింది.

కమ్మలుతీసుకుని ముందే తెచ్చిన ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి చుట్టి నిక్కరు జేబులో పెట్టుకున్నాడు.

"మన టయాలు బాగలేవుమా... పనులులే పాడూలే. వానలు సరిగ్గా పడతాన్నింటే రైతుల దెగ్గిర దుడ్డాడతాండు. అప్పోసప్పో చేసన్నా కమ్మలు తీసిచ్చేసిందు. వచ్చే మాసువులనాటికి తీసిస్తాను. ఇప్పుడే తీసీలేనుమ్మా"

"సరేలే నాయినా. ఇప్పుడు నిన్నేమన్నా అడిగినామా. మీ అల్లుడుకూడా మంచోడు. ఈ కమ్మలు మనయి కాదనిచెప్పినా. ఇప్పుడు ఐదెకరాల్లో చెనిగ్గింజలు ఏసిండాము. ఈసారి పంటలో ఆయనే కొత్తకమ్మలు తీసిస్తానన్నేడు" అనింది కూతురు.

"అల్లునిగ్గూడా మాటకాడికి వాచీ వుంగరం తీసీనీలే. ఇద్దరికీ మాసువుల్లో తీసిస్తాలే" అని చెప్పి వచ్చేశాడు ఆచారి.

ఆ తర్వాత దీపావళికి అల్లుడుకూతుర్ని ఇంటికి తీసుకొచ్చాడు. ఒక రోజు కూతురు "నాయినా... మీ అల్లుడేమో మంచోడే. కానీ మా అత్తోళ్లు ఒగోసారి సాటవలుపెట్టి మాట్లాడతాంటారు. వోళ్లకు చెప్పినకాడికి మాటలేకుండా పెట్టేస్తే బాగుంటాది నాయినా." అనింది.

ఆచారికి చాలా బాధయింది. "చెప్పినానుకదామ్మా. మాసువుల్లో తీసిస్తానని. ఈసారి కూడా వాన ఎనిక్కి కొట్టేసింది. చెనిగి చేన్లంతా ఎండిపోతాండాయి. పంట వస్తాదో రాదో. ఇద్దుర్ని ముగ్గుర్ని అడిగి పెట్టిండా. మాసువుల్లో ఇస్తామన్నేరు. అల్లునికి తీసీలేకపోయినా నీకు మాత్రం కమ్మలయినా చేపిస్తాం" అన్నాడు ఆచారి.

"ఆయనగ్గూడా వాచీ వుంగరం పెడితే బాగుండు" అని గొనిగింది కూతురు.

"పెట్టాలనే వుండాదిమ్మా. పూట గడిసేదే కష్టంగా వుండాదే. మీ చిన్నప్పటి మాదిరిగా లేవు రోజులు. అప్పుడు తొలిముంగార్ల వానలు పన్నె కాన్నించి పనుంటాండె. మడకలు చెక్కేది, గుంటకలు చెక్కేది, దండిగా వుంటాండె. వాటికి మేరొస్తాండె. మేరగింజలతో ఆరేడు నెల్లు తిండికి బయం లేకుండా వుండె. ఇంగ తొలిక్కట్టెలు ఏసిందానికి, కొడవండ్లకు కక్కుపెట్టిందానికి కూడా మేరగింజలు వస్తాండె. అయ్యికాకుండా మనం తుండ్లు కోసే పనులు వుండనేవుండె. వాటికీ దుడ్డు వస్తాండె. పస్తుల్లేకుండా జీవనం జరిగిపోతాన్నింది. ఇప్పుడట్ల లేదుమ్మా. మడకలుచెక్కేవాళ్లు వూర్లో ఇద్దరం ఐనామా. దానికి తోడు కరువు. రైతులకే పంటలు

పండలా. ఇంగ మనకేం మేర ఇస్తారు. పీలేరుకు పనికి పోదామనుకుంటాండాను. పోతేగన ఇద్దరికీ గూడా తీసిస్తాను" అన్నాడు ఆచారి.

రెండేళ్లనించి కూతురు అల్లుడు అప్పుడప్పుడు వస్తాండారు. వచ్చినప్పుడంతా కూతురు గుర్తు చేసేది. తండ్రికి వాటిని తీసివ్వడం సాధ్యం కాదనుకునిందేమో కొన్నాళ్ల తర్వాత గుర్తు చేయడం మానుకునింది. వాళ్లు అడగరని తెలుసు, అయినా ఏదో తప్పు చేసినామనే భావం వాళ్లు వచ్చినప్పుడంతా ఆచారిని తొలుస్తా వుంటుంది. ఏదో ఒకనాటికి వాళ్లకు చెప్పినకాడికి తీసివ్వాలనే అనుకుంటా వుండాడు.

"నీళ్లు తాగునాయినా" అని సురేంద్ర అనడంతో ఆచారి ఆలోచన్ల నుంచి బయటపడి తలెత్తి చూశాడు. ఎదురుగా నీళ్ల చెంబుతో కొడుకు నిల్చుని వున్నాడు. చేతులకంటిన మట్టిని వేరుశెనగ చెట్లకు తుడిచి చెంబును తీసుకున్నాడు. నోట్లోకొన్ని నీళ్లు పోసుకుని పుక్కలించి వుంచినాడు.

"మీ అమ్మ ఏం చేస్తాంది?" అని తలను పైకెత్తి పెదవులకు తగలకుండా చెంబుతో నీళ్లను తాగసాగాడు.

"రవి అందుకుంటాన్నేడు. అమ్మ గంజి వంచతాన్నింది. పుల్లగూర చేస్తాండాదంట. అరగంట పోయినాంక వచ్చి తినేసి పొమ్మనింది" అన్నాడు సురేంద్ర చేను పక్కనున్న మామిడితోపు బండనే తదేకంగా చూస్తూ.

ఆచారి చెంబు నీళ్లను తాగేశాడు. అప్పటికి సూర్యుని కిరణాల వేడితాకిడికి మంచు కరిగిపోయి ఎండ తగులుతోంది. జుట్టు గొరిగిన తలలా వున్న బండను ఆచారి కూడా చూసి కొడుకుతో "ఏమట్ల చూస్తాండావే?" అన్నాడు.

"ఇంతకు ముందు ఇట్లాకాలమొస్తే ఆబండమింద యాడేగాని జాగా వుండేదికాదు. కదా. వడ్లమోపులు ఒగపక్క, చెనిగి వాములు ఇంగోపక్క వుండేటియి. బండంతా చాలక కొందురు ముట్టిమానుబండమిందికి తోలతాండిరి. ఇప్పుడు బండంతా ఖాళీగానే వుండాదే" అని సురేంద్ర వంగి వేరుశెనగ చెట్లను పెరకసాగాడు.

ఆచారి కూడా కొడుకుతో పాటు వంగి చెట్లను పెరుకుతున్నాడే కానీ అతని కండ్ల ఎదురుగా బండ, బండమీద సుట్టిండ్ల మాదిరిగా వుండే మోటగెడ్డి కనిపిస్తా వుండాది. అప్పుడు ఆచారి ఇంట్లో తిండికి తిప్పలు పడతాండారు. రెండేండ్లనించి కరువు. ఆ సంవత్సరమే వానలు బాగా పన్నేయి. వరి కోతలుకోసి అంతా బండల మింద ఏసి కుప్పలు కొట్టేసి పదిరోజులయిండాది. కుప్పలు కొట్టిన రెండు రోజులనించి వాన పట్టుకున్నింది. ఆ పొద్దే తెరపిచ్చింది.

పద్దన్నే శెట్టిగారి క్రిష్ణమ్మ వచ్చి నిద్రలేపింది ఆచారిని.

"ఏమక్కా... ఇంతపద్దన్నే వచ్చినావే"

"ఏంలేదు ఆచారి. ఏదన్నా పనుండాదా?"

"పనేదుండాదికా... ఏన్నాళ్లయింది పనిచేసి. ఏడాదికొగసారి కూడా వాన పడేదిలే. పన్నే సేద్దిమంతా మీరు ట్రాక్టర్లతో చేపిస్తాండారు. నాకు మడకలు చెక్కే పనికూడాలేదే"

"ఈ సారి మాకు వడ్లు బాగా పండినాయి. కుప్ప గొట్టేటప్పుడు వాన వచ్చేటిగా వుంటే ఇట్ల రెండేట్లు అట్ల రెండేట్లు కొట్టేసి మోటగెడ్డి పక్కనేసిండాము. సగం వడ్లు వుండిపోయినాయి. ఆగెడ్డి ఇదిలించినామంటే ఎట్ల లేదన్నా మూడు నాలుగు మూటలుంటాయి వడ్లు" అనింది క్రిష్ణమ్మ.

"అన్నేడుంటాయిలేకా... జొల్లు వడ్లు నిల్చిపోయింటాయి." అన్నాడు ఆచారి.

"లేదు లేదు... కనీసం మూడు మూటలు వడ్లు వుంటాయి. మీరు ముగ్గురూగన పోయినారంటే ఒగరోజు పని. రాత్రే సత్తార్‌గాడు వచ్చి గెడ్డి మేము ఇదిలించుకుంటాముకా అనడిగె. మళ్ల చెప్తాన్లేరా అంటి. ఇంటి ఎదురుంగా వుండే వోనివి గదా. పనుల్లేక ఇబ్బంది పడతాండారని మీకుచెప్పినా. పోయి ఇదిలించుకోపోండి" అనింది.

"యాడకా..." అంటూ ఆచారి నసుగుతా వుండగానే "ఇప్పుడే పోతాంలేకా. మళ్లొచ్చి కావాలంటే అన్నం చేసుకుంటాం" అనింది ఆచారి భార్య.

"మీరు పొయ్యేసి గడ్డంతా పెరికి ఇదిలిస్తా వుండండి. బాయికాడికి వచ్చినప్పుడు నేను ఎద్దుల తోలుకోనొస్తా" అని చెప్పి వెళ్లిపోయింది క్రిష్ణమ్మ.

"అదిగాదే..." అని ఏదో చెప్పబోతున్న ఆచారి మాటలను మధ్యలోనే అడ్డుకుంటూ "ఇంట్లో వూరికేనే ఎందుకుండేది. అదేం కూలి పని కాదుకదా. పని చేసుకుంటే నెల బత్తెమన్నా వస్తాయి. పదాం పాండి" అనింది శివమ్మ. ఇంటికి తాళం వేసి చీపురుకట్ట, రెండు గంపలు, దాట తీసుకుని ఆలూమగలు, సురేంద్ర బండమీదకు చేరుకున్నారు. సుట్టింటిలాగా పేర్చిన మోటగెడ్డిని కొంచెం కొంచెం తీసి బండమీదంతా విదిలించడం మొదులుపెట్టినారు.

వారం రోజులనుంచి విడవకుండా కురిసిన వానకు గడ్డిమధ్యలో ముగ్గిపోయిండాది. ఆ గడ్డిని తీసినప్పుడు మధ్యలోనించి పొగలాగా వస్తాంది. గడ్డిని తీస్తూ "ఎంత వుడుగ్గా వుండాది నాయినా" అన్నాడు సురేంద్ర.

"అంత వుడుగ్గా వుంటేనే కదా గడ్డి ముగ్గి వడ్లు రాలతాయి" అన్నాడు ఆచారి.

బండమీద వాళ్లదే కాకుండా ఇంకా నలుగురి గెడ్డి వుండాది. పదిబారల విస్తీర్ణంలో గడ్డిని వేశారు. అప్పటికి క్రిష్ణమ్మ తమ ఎద్దులను తోలుకోని వచ్చింది. ఆచారి వాటి మెడల మీంద కాడిమాను పెట్టి కట్టినాడు. సురేంద్ర చేతికి ములుబరగ తీసుకోని ఎద్దుల రెండు పగ్గాలు ఒగ చేత్తో పట్టుకుని గడ్డిని తొక్కించసాగాడు. ఆచారి, శివమ్మ గడ్డిని తీసి మరో పక్కన విదిలించసాగారు.

అరగంట గడ్డిని తొక్కించినాక ఎద్దలను పక్కకు తోలి కిందుండే గడ్డిని తీసి ఇదిలించి పక్కన వేయసాగారు. గడ్డికిందుండే వడ్లనుచూడగానే ముగ్గురిలోనూ ఆనందం. పక్కనున్న మోటగెద్దిని, కింద రాలిన వడ్లను చూసి క్రిష్ణమ్మక్క చెప్పినట్టు ఎట్ల లేదన్నా మూడు మూటలన్నా వుంటాయి' అనుకున్నారు.

ఉత్సాహంగా గడ్డినంతా ఎత్తి పక్కన వేసి మళ్లీ మోటగెద్దిని తీసి విదిలించసాగారు.

శివమ్మ అన్నం చేసుకుని రావడానికి ఇంటికి పోయింది.

"ఏంబా ఆచారి... పద్దన్నే మంచి పని పట్టుకున్నేరే. మాది కూడా ఇదిలిస్తారా" అన్నాడు సిద్దారెడ్డి.

"ఇదిలిస్తాంనా... ఈ పొద్దు ఇది ఐపోతాది. రేపు వస్తాం" అన్నాడు ఆచారి వుత్సాహంగా.

"మళ్లా వానొచ్చేటిగా వుండాదే." అన్నాడతను ఆకాశం వైపు ఎగచూసి.

"రాదులేనా... ఎవురికీ చెప్పద్దు. రేపు తప్పకుండా వస్తాం"

"సరేసరే... మాది మా మడికి దెగ్గిరిగా వుంటాదని పెద్దబండ మింద ఏసినాం. మొబ్బుతోనే వచ్చేయండి" అని చెప్పి వెళ్లిపోయాడు సిద్దారెడ్డి.

మరో గంటకంతా అన్నం తీసుకోనొచ్చింది శివమ్మ. సాయంకాలం నాలుగు గంటలకంతా గడ్డి ఇదిలించి తొక్కించడం పూర్తయింది. తొక్కించిన గడ్డినంతా తీసి పక్కన పొడవుగా వేశారు. కిందుండే వడ్లను ఒకచోటకు తోశారు. తోసినవాటిని చాటతో ఎత్తి గాలికి ఎదురుగా తూర్పుపట్టసాగారు.

"ఆచారీ. నీపని మేలుగా వుండాదే." అన్నాడు సిద్దారెడ్డి ఇంటికి గొడ్లను తోలుకుని పోతూ.

"ఏముందిలేనా... ఈటిల్లో జొల్లు ఎన్నుంటాయో. మొబ్బుతోనే వస్తాంనా" అన్నాడు ఆచారి.

"లేదులేబా... మాలపల్లోల్లు వచ్చి ఇదిలించేసినారు. అయిపోయిండాది"

"అదేంనా... నాకు పద్దన్నే గదా చెప్పినావు. ఎవురికీ చెప్పనంటివి గదానా" అన్నాడు ఆచారి బాధగా.

"ఏంచేసేది. నేను ఇంటికిపోయాలకు మాలపల్లోల్లు వచ్చి కుచ్చోనున్నేరు. ఈసారి పంట వచ్చినప్పుడు తప్పకుండా నువ్వే ఇదిలిద్దువులే" అని చెప్పి వెళ్లిపోయాడతను.

తర్వాత రెండేండ్లయితాండాది. ఇంతవరకు ఆచారికి గడ్డి ఇదిలించే పని చెప్పలేదు సిద్దారెడ్డి. ఒక సంవత్సరం పంటేలేదు. ఒక సంవత్సరం వాళ్లే గడ్డి ఇదిలించుకున్నారు. ఎప్పుడో ఒకసారి పంటలు పండుతుండటంతో పండిన ఒక్క ధాన్యం గింజను కూడా పక్కవాళ్లకు పోనివ్వడం లేదు రైతులెవ్వరూ. వానలు టయానికి పడకపోవడంతో ఎవరి పనులు వాళ్లే చేసుకుంటున్నారు.

"నాయినా... ఆకలిగా వుండాది. తినేసి వద్దామా?" అనడంతో ఆచారి ఆలోచనల్లనుంచి తెప్పరిల్లాడు.

ఎండ చురచురలాడుతా వుంది.

ఆకాశంవైపు చూసి తొమ్మిదయింటాది అనుకున్నాడు ఆచారి. తాము చెట్లు పెరికిన వైపు చూశాడు.

"అరెకరా పెరికేసింటామా" అన్నాడు సురేంద్ర.

"మూడు కొంద్రెలు అయిపోయినాయా... ఆడికాడికి అరెకరా వుంటాది"

"అయితే సందేళకు ఒగ ఎకరా అయిపోతాది. మొత్తం ఎన్నెకరాలు నాయినా"

"వోళ్లు మూడున్నరెకరా అన్నేరు. నాలుగన్నరెకరా వుంటాది" అన్నాడు ఆచారి చేనంతా పరిశీలనగా చూసి.

"అయితే మూన్నూటయాబైకే ఒప్పుకున్నేవే?"

"ఇంకేం చేస్తాం... యిది వొదులుకున్నేమంటే ఇంగ వేరే పనిలే. ఏదో ఒగటిలే. దీనిగ్గూడా మాలపల్లోల్లు, సాయుబులు పోటీ బన్నేరు. ఇట్ల అవసరంనా అంటే మనకే ఒప్పించినాడు"

"నాలుగున్నరెకరా అయినా... ఈ పొద్దుగాక ఇంగ మూడుదినాలు పెరికినామంటే ఐపోతాది కదా. చెట్లు పెరికేది ఐపోతానే దుడ్డు తీసకపోయి మా ఐవోరికి ఇచ్చేయాల."

"యిచ్చేద్దువులే. నా బతుకంతా బాకీలతోనే జరగతాండాది. ఎప్పుటికప్పుడు బాకీలు తీరతాయనుకుంటాండాను. కానీ తీరిందేలే. నువ్వు నామాదిరిగా యాడేగాని బాకీ వుండగూడదు. అందుకే గదా తక్కువయినా ఒప్పుకోని చెట్లు పెరకతాండాం. ఈళ్లు దుడ్డు ఇస్తానే తీసకపోయి యిచ్చేద్దువులే. బాకీలు చేయగూడదు. కానీ ఏం చేద్దాం, మనట్లా వోళ్లకు తప్పుతాదా?"

సురేంద్ర మౌనంగా వుండిపోయాడు.

తిరిగి ఆచారే మాట్లాడుతూ "యిప్పుడు యిద్దరం ఎందుకులే యింటికి. నువ్వు తినేసి నాక్కొంచెం తీసుకోని రాపో. నేను చెట్లు పెరకతాంటా" అన్నాడు.

సురేంద్ర యింటికి వెళ్లాడు. కొండకు మేతకు వెళుతున్న పశువుల మెడల్లోని గంటల శబ్దం గణగణమంటూ లయబద్ధంగా వినిపిస్తోంది. పశువుల వెంట పోతున్న పిల్లగాడెవడో సినిమా పాట పాడుతున్నాడు. ఈశాన్యమూల ఎర్రగొండమీదనుంచి మేఘాలు ఒక్కొక్కటే పైకెగబడుతున్నాయి. వాటిని చూసి చిత్తకార్తె కదా, వాన వస్తుందేమో అనుకున్నాడు ఆచారి.

"ఏంనో... ఆచారనా... ఈ పని పట్టుకున్నేవే?" పలకరించాడు రమణారెడ్డి.

"ఏం చేసేది రమణా... కడుపాత్రం కోసరం ఏదో ఒగపని చేసుకోవాల గదా. నువ్వేమి నడుచుకుంటా బోతాండావే?"

"బస్సు తప్పోయిందినా... పీలేరుకు పోవాల. లోనుకోసరం బేంకు సుట్టకారం తిరగతాండా. కమ్మారపల్లెకు పోయి బస్సెక్కతా" అన్నాడతను నడుస్తూనే.

"ఈసారి పనిచేసేద్దామా?"

"ఏం చేస్తాంలేనా... కూతురికి పెండ్లి పెట్టుకుంటాండాం. యిప్పుడిప్పుడే కాదులే" అని వెళ్లిపోయాడతను.

ఆచారి వంగి చెట్లు పెరుకుతున్నాడు కానీ అతని మనసు మాత్రం రమణారెడ్డి వెంటే వుంది.

ఐదేళ్ల ముందు సంగతది. "యింటి పనెత్తుకోవాలనుకుంటాండాంనా... బాయికాడుండే యేపమాన్లు పడగొసి పెట్టుకున్నేమంటే ఆరతాయి. ఆర్నెల్లు పోయినాంక తీర్లు, పలకలు కోసి తలుపులు దాలమంద్రాలు చేద్దురు." అన్నాడు రమణారెడ్డి.

"ఏం పనీపాటాలేక గమ్మునుండాం. రేపే వస్తాంలే" అన్నాడు ఆచారి.

చాలా రోజుల తర్వాత పని దొరికింది వాళ్లకు. పడుకున్నా కానీ పని మీదే మనసంతా ఉండటంతో ఆలూమగలకు కలతనిద్రే పట్టింది. శివమ్మ తెల్లవారుజాము అయిందనుకుని లేచి వంటపని ప్రారంభించింది. ఆచారికి మెలకువ వచ్చింది కానీ అప్పట్నుంచి చేసే పనేం లేదనుకుని మళ్లీ కళ్లు మూసుకుని పడుకున్నాడు. శివమ్మ అన్నం, కూర చేసేసింది. అయినా తొలికోడి కూతేయలా.

"ఏం శివక్కా మేలుకోనుండావే..." అనింది ఒంటికి పోవడానికని వీధిలోకొచ్చిన పక్కింటి నిర్మల.

"పద్దన్నే మారేళ్లకు పనికి పోవాల నిర్మలా... అన్నం కూర చేసేసినా. ఎంత రయ్యాయిందో తెల్లా. కోళ్లు కూయలా. తూర్పున పటమెగరలా"

"ఒంటిగంటయిందికా... అప్పుడే అన్నం కూర చేసేసినావా. పడుకోపో ఇంగా చానా రెయ్యుండాది" అని వెళ్లిపోయిందామె.

దీపం ఆర్పి పడుకుంది శివమ్మ. 'మొబ్బుతో మెలకువ వస్తాదో రాదో. పొద్దుపుట్టక ముందు ఎలబారితే ఎనిమిదికంతా ఆడికి యెళ్లిపోవచ్చు' అనుకుంది. రాత్రి ఒంటి గంటవరకు నిద్ర లేకపోవడంతో గాఢంగా నిద్ర పట్టేసింది.

"ఏమే... లెయ్... తెల్లారి పోతాండాది" అని ఆచారి అనడంతో ఉలికిపాటుగా లేచి కూర్చుంది శివమ్మ. చీకటిని వెలుతురు తరుముకుంటూ వస్తోంది.

యిద్దరూ గబగబా తయారయ్యారు. అన్నం మూట కట్టుకోని రంపం, గొడ్డలి, కొడవలి తీసుకున్నారు. అప్పటికింకా గురక పెట్టి నిద్రపోతున్న కొడుకును లేపారు. 'అన్నం తినేసి బడికిపో, యాడంటే ఆడ తిరగద్దు. మద్యాన్నం నేరుగా ఇంటికిరా. ఎండకు చింతచెట్ల కిందికి

పోయి ఎగరకుండా ఇంటికాన్నే వుండు' అని జాగ్రత్తలు చెప్పి వాళ్లు పనికి బయలుదేరారు. అప్పటికి వాళ్ల కూతురు వాయల్పాడులో హాస్టల్లో వుండి చదువుకుంటోంది. శెలవు రోజుల్లో అయితే సురేంద్రను కూడా వెంట తీసుకెళ్లే వాళ్లు. ఆరోజు శెలవు కాకపోవడంతో వాడిని ఇంటిదగ్గరే వదిలేసి పోయారు.

అది మార్చినెల. పొద్దుపొడిచినప్పటినుంచి ఎండలు మండుతున్నాయి. దారిపొడువుకూ ఎదురెండ. ఎనిమిది గంటలకంతా పని దగ్గరకు చేరుకున్నారు. చెట్టుకింద నీడన కూర్చుని ఆచారి ఆకురాయితో రంపాన్ని రాయసాగాడు. శివమ్మ పల్లెలోకి పోయి చిన్నపాత్రతో బోరింగు దగ్గనుంచి నీళ్లు తీసుకుని వచ్చింది. కొడవలి తీసుకుని వేపచెట్టు మొదులు చుట్టూవున్న కంపచెట్లను కొట్టి శుభ్రం చేసింది. ఆచారి రంపం రాయడం పూర్తవుతూనే గొడ్డలిని కళ్లకద్దుకుని చేతికి తీసుకున్నాడు. చెట్టుకు దూరంగా పోయి ఏ వైపు వాలు వుందా అని చూశాడు. దగ్గరకొచ్చి వాలు వుండేవైపు చెట్టుకు మొదులులో 'ఇండె' ఏసినాడు. తర్వాత రంపం తీసుకుని చెట్టుకు చెరొక వైపున కూర్చుని కోయసాగారు. మధ్యాహ్నానికి చెట్టుపడిపోయింది.

చెట్టు మొదులులో చేత్తో మన్ను కొంచెం పోసి యిద్దరూ "తప్పయిపోయింది. మమ్మల్ను క్షమించు. కడుపాత్రం. తప్పడంలేదు. మమ్మల్ను చల్లగా చూడు సామీ" అని చేతులు జోడించి దేవున్ని వేడుకున్నారు.

పక్కనుండే చెట్టునీడన కూర్చుని అన్నం తిన్నారు. సక్కగా వుండే ఒక వేపపుల్లను చేత్తో కొలతపెట్టి మోరపొడవుకాడికి ఇంచినాడు ఆచారి. దాంతో చెట్టు మొదులును నాలుగు మోరల వద్దకు కొలతపెట్టి గుర్తుకోసం గొడ్డలితో ఒకదెబ్బవేశాడు. మొదులుకు చెరొక పక్కన వొంకోని రంపంతో కోయసాగారు. దాంతో పాటు మరో రెండు వేపచెట్లను ఐదు రోజుల్లో కోసేశారు. తలుపులకు, దాలమంద్రాలకు, కిటికీలకు పనికివచ్చే తుండ్లను అన్నింటిని ఒగచోట వుద్దగా పేర్చారు. మిగిలిన కట్టెనంతా మరో పక్కన పేర్చారు.

"చెర్లో ఇటికి కోపిస్తాండాం. ఈ కట్టితో కాలిపిస్తా. అర్నెల్లయితానే వచ్చి పనెత్తుకోండి. ఇంటికి సరిపోయేకాడికి యీటితో చేసుకుందాం. చాలకపోతే పీలేరుకుపోయి చెక్కలు తెచ్చుకుందాం." అన్నాడు రమణారెడ్డి.

సరేనన్నాడు ఆచారి. ఐదేండ్లవుతాండాది. ఆచారి రెండుమూడునెల్లకొగసారి నాలుగుమైళ్ల దూరం నడుచుకుంటా పోయి రమణారెడ్డికి కనిపించి వస్తానే వుండాడు. అప్పటినుంచి ఈసారి వానలు పడి పంటలు రానీ, ఈసారి వానలు పడి పంటలు రానీ అంటానే వుండాడు. వానలు పడిందిలేదు, పంటలు వచ్చింది లేదు. రమణారెడ్డి కోపించిన యిటిక చెర్లో బట్టీలోనే వుండాది. బాయికాడ కోసిన తుండ్లు ఎండి పగుళ్లు ఏర్పడినాయి. వాటిల్లో చాలా పనికిరాకుండా పోయినాయి. అదంతా గుర్తొచ్చి ఆచారికి బాధనిపించింది.

మూడేళ్ల చిన్నకొడుకును వెంట పెట్టుకుని శివమ్మ, నెత్తిన అన్నంతట్టపెట్టుకోని సురేంద్ర వచ్చారు. చేనంతా పెరకడానికి వాళ్లకు ఆరు రోజులు పట్టింది. మొదటి రోజు ఉన్న హుషారు రానురాను తగ్గిపోయింది. రాత్రుల్లో కూడా నిద్రలేకుండా పనిచేయడంతో బాగా అలసిపోయారు. దానికి తోడు ఇంక ఎకరానేల వుండాదనంగా సురేంద్ర రెండు చేతుల వేళ్లకు బొబ్బలు వచ్చేశాయి. చేతి వేళ్లకు గుడ్డచుట్టుకుని చెట్లు పెరికాడు. చివరి ఎకరానేలలో చెట్లు పెరకడానికి వాళ్లకు రెండు రోజులు పట్టింది.

మధ్యమధ్యలో సురేంద్ర ఆచారికి గుర్తు చేస్తూనే వున్నాడు డబ్బు అడగమని. చెట్లు పెరికేది పూర్తయితేకాని యివ్వమన్నారు వాళ్లు. ఆ రోజు రాత్రి పదిగంటలకు పూర్తయింది. చేతివేళ్లు కదిలించలేనంతగా చర్మం వూడిపోయినా, వళ్లంతా పచ్చిపుండులా మారినా సురేంద్ర చాలా సంతోషంగానే వున్నాడు. పనియిపోతానే వుడుకుడుగ్గా నీళ్లు పోసుకుని అన్నంతినేసి పడుకున్నాడు. 'పద్దన్నే డబ్బు తీసకపోయి ఐవోరికి యిచ్చేస్తాం' అనుకోవడంతో వాడికి ఎంతో నిశ్చింత అనిపించింది. దాంతో ఆరురోజుల తర్వాత ఆరోజు చాలా గాఢంగా నిద్రపోయాడు. తెల్లవారి ఎనిమిది గంటలకు ఆచారి లేపేంతవరకు మెలకువ రాలేదు. లేస్తూనే "డబ్బు యిచ్చినారా నాయినా" అన్నాడు.

"అంతా ఈలా... నూర్రూపాయలిచ్చినారు. మిగిలింది రేపిస్తారంట. మీ ఐవోరికి ఈ పొద్దే యిచ్చేద్దాంలే" అన్నాడు ఆచారి.

సురేంద్ర చకచకా తయారయి అన్నంతినేసి పుస్తకాలు తీసుకున్నాడు.

"యింట్లో ఎర్రగడ్డలు, మిరపకాయలు, చింతపండు ఐపోయినాయంట. నూనెగూడా లేదంట. నేనూ కమ్మారపల్లెకు వస్తాండా" అని చేతిసంచి తీసుకుని కొడుకుతో పాటు ఆచారి కూడా బయలుదేరాడు.

దారిపొడవుకూ సురేంద్ర ఉత్సాహంగా మాటలు చెప్తున్నాడు. కొడుకును చూసి ఆచారి బాధపడ్డాడు. 'వారం దినాలు రాత్రీ పొగులూ కష్టపడినాడు. బిడ్డ ఎంత తగ్గిపోయినాడు. యింత చిన్నవయసుకే ఎందుకిన్ని తిప్పలు' అనుకున్నాడు.

నేరుగా సైన్స్ అయ్యవారి ఇంటికి పోయారు. యింటి తలుపు కొద్దిగా తెరిచివుంది. సురేంద్ర గబగబా తలుపుమొత్తం తోసి లోపలకు అడుగు పెట్టాడు. అడుగు పెట్టినవాడు పెట్టినట్టే నిలబడిపోయాడు. వాడికళ్లనిండుకు నీళ్లు. అయ్యవారి ఇల్లు ఖాళీగా వెక్కిరిస్తోంది.

"నాయనా... చూడు నాయనా... ఐవేరోళ్లు ఎళ్లిపోయిండారు... దుడ్డు ఇచ్చేద్దామని బడిగ్గూడా పోకుండా పని చేస్తి... చేతులు బొబ్బలు వస్తాన్నే పనిచేసి దుడ్డు తీసుకోనొస్తే ఐవేరు ఎళ్లి పోయిండాడే... నన్ను ఎంతగా తిట్టుకుంటాడో... మా స్టూడెంటు తప్పుడోడు అనుకున్నేడేమో ఐవేరు... ఎట్ల నాయినా ఐవేరి బాకీ తీర్చేది... ఎప్పుడు తీర్చేది...

చూడునాయినా...” అంటా ఏడుస్తూనే ఖాళీగా ఉన్న ఇంటిని, బొబ్బలెక్కిన చేతులను తండ్రికి చూపిస్తున్నాడు వాడు. ఏదో చెప్పాలని చూస్తున్నాడు... కానీ దుఃఖం వాడి గొంతు పెగలనీయడంలేదు.

కొడుకు ఏడుపు ఆచారిని కూడా కలచి వేసింది.

“ఏమీ ఖర్మము... బతికేదానికి బాకీ చేస్తాండాము... అయ్యి తీర్చాలని ఎంత పోరకలాడతాన్నే తీరడంలేదే... మామ బాకీ తీరనేలే... ఏపొద్దేగానీ పెండ్లాం దగ్గర తీసుకున్నిందేగానీ ఒగసారి కూడా తిరిగి ఈలా... కూతురికి బిడ్డలు పుట్టినా అల్లునికి వాచీ ఉంగరం పెట్టలేకుండా ఉండాం... ఇంటికోసరం అని రమణారెడ్డి కోపించిన తుండ్లు అట్లే ఎండి పోతాండాయి... పని చేస్తామంటే వానల్లేక మాకే పనుల్లేవంటాండాడు... ఉప్పురాతి పని దొరకలా... జీవితమంతా బాకీలే... ఒగబాకీ కూడా తీరలా... పిల్లోని బాకీ అన్నా తీరద్దామని బిడ్డానేను రేయిం పొగులు కష్టపడితిమే... అయినా ఐవేరు బాకీ తీర్చలేకపోతిమే... నా బతుకంటే బాకీలతోనే సరిపాయ... చిన్నప్పటినించే ఈనిదిగూడా బాకీల బతుకు చేస్తాండావు ఎందుకు రా దేవుడా...?” అంటా ఆచారి కూడా కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

మెల్లిగా కొడుకు దగ్గరకు పోయాడు. వాడి భుజం మీద చేయి వేసి ధైర్యం చెప్పాలనుకున్నాడు... మాటకన్నా ముందు ఆచారి కండ్లనుంచి నీళ్లు కాలువలు కట్టసాగాయి. ఆయన గొంతు కూడా దుఃఖంతో పూడుకుపోయింది...

తండ్రీ కొడుకులు ఒకరినొకరు పట్టుకుని భోరున ఏడుస్తున్నారు.

ప్రకృతంతా ఒక్కక్షణం స్తంభించినట్టుగా అయింది...

అదే సమయంలో...

ఒక నగరంలోని నక్షత్ర హోటల్ గదిలో...

దొంగలెక్కలు చూపించి బ్యాంకులకున్న బాకీలను...

కోట్లలో ఎగనామం పెట్టడంలో సఫలీకృతులైనందుకు...

ఒక పారిశ్రామికవేత్త... ఆయన చూపుడు వేలు మేనేజర్... ఆదాయపుపన్ను ఎగ్గొట్టించడంలో ఆరితేరిన ఆడిటర్... సమయా సందర్భాలను బట్టి సలహాల రూపంలో సహకరించే వకీలు...

ఒకరినొకరు అభినందించుకుంటూ...

మందు మత్తులో చిందులేస్తూ...!

ఆముద్రితం